సాక్షి
చిత్తూరు
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



పరిమళించిన మానవత్వం
ఓ పీఎంపీ వైద్యుడు.. ఎస్ఐలోని మానవత్వం పరిమళించడంతో ఓ వృద్ధురాలి ప్రాణం నిలిచింది. - 8లో



అసంబద్ధతలు తొలగించాలి
ఉపాధ్యాయ బదిలీల చట్టంలోని అసంబద్ధతలను తొలగించాలని ఎస్టీయూ నేత గంటా మోహన్ డిమాండ్ చేశారు. - 8లో



పాఠశాలల్లో టీవీలే టార్గెట్
పాఠశాలల్లో టీవీలనే టార్గెట్‌గా చేసుకుని చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నవకాంతులు వెల్లి విరియాలి



శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి ఇంటా నవకాంతులు వెల్లివిరియాలని, శ్రీరామనవమిని సుఖసంతోషాలతో జరుపుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకాంక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఆయన శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. రామాయణం మనకు ఎన్నో నీతులను నేర్పుతుందన్నారు. మన కుటుంబంలో, స్నేహితుల్లో, సమాజంలో ప్రేమను, శాంతిని నెలకొల్పుదామన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

కాణిపాకం: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉత్సవం జరుగుతుందన్నారు.

సామాన్యుడికి కరెంట్ షాక్

- రూ.5,252 బిల్లులో అదనపు బాదుడు రూ.2,147
- సోషల్ మీడియాలో జనసేన నేత పోస్టు



ఏప్రిల్ బిల్లులో అదనపు మొత్తం రూ.2,147

చిత్తూరు కార్పొరేషన్: కరెంటు బిల్లుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు. ఇలాగైతే సగటుజీవి సంపాదన సగానికి పైగా విద్యుత్ బిల్లు చెల్లించడానికే సరిపోతుందని జనసేన నాయకుడు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. శనివారం నగరానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు శరవణ ఈ విషయంపై తన బాధను వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి సామాన్య ప్రజల్లో వ్యతిరేక భావం కలిగించేలా చేస్తున్నారంటూ కరెంటు బిల్లును జత చేసి పోస్టు పెట్టారు. నగరంలోని మిట్టూరు సెక్షన్ పరిధిలో 1537 సర్వీసు నంబర్‌లో ఓ వినియోగదారుడు చిన్న ఫొటో స్టూడియోను నడుపుతున్నాడు. గతంలో అతనికి రూ.2 వేలు వరకు బిల్లు వచ్చేదని అతను చెప్పాడన్నారు. ప్రస్తుం మార్చి నెలలో అతడు 353 యూనిట్లు వినియోగించగా అందుకు రూ.3,105 బిల్లు వచ్చిందన్నారు. ఫిక్సెడ్ చార్జీ రూ.450, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.353, ఎఫ్‌పీపీసీఏ రూ.1,004, ట్రూ అప్ చార్జీ రూ.140, సర్‌చార్జీ, ఇతర చార్జీల రూపేణా రూ.200 కలిపి మొత్తం బిల్లు రూ.5,252 ఇచ్చారన్నారు. అంటే రూ.5,252 బిల్లులో రూ.2,147 అదనపు చార్జీల రూపేణా వడ్డించారు. ఇలాగైతే ప్రభుత్వానికి చెడ్డపేరు రాదా? అని ఆయన ప్రశ్నించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 66,327 మంది స్వామివారిని దర్శించుకోగా 26,354 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

స్వచ్ఛత పరిఢవిల్లేనా..
పురస్కారం దక్కేనా?

- శుభ్రత మెరుగుపడితే ర్యాంకు తథ్యం

స్వచ్ఛసర్వేక్షణ్‌లో ఈ సారి దేశంలోనే అత్యుత్తమ మున్సిపాలిటీలుగా జిల్లాలోని చిత్తూరు నగరంతోపాటు మిగిలిన నాలుగు మున్సిపాలిటీలను నిలిపేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. స్వచ్ఛసర్వేక్షణ్ పరిశీలనకు మున్సిపాలిటీలను సరికొత్తగా చూపేందుకు కసరత్తు చేస్తున్నారు. మన మున్సిపాలిటీలు పరిశుభ్రత పరిమళాలు ప్రజలందరికీ పంచి.. స్వచ్ఛతలో మెరిసి..హేమాహేమీ నగరాలతో కుస్తీ పట్టి.. పలు రాష్ట్రాల రాజధానులను వెనక్కి నెట్టి.. ఆటుపోట్లను ఎదుర్కొని.. అత్యుత్తమ మున్సిపాలిటీలుగా పురస్కారం దక్కించుకుని ఉత్తుంగ తరంగమై ఎగిసి పడుతాయో లేదో వేచి చూడాల్సి ఉంది.





చిత్తూరులో ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు, చిత్తూరులో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు(ఫైల్)



- ఫీడ్ బ్యాక్‌పై ప్రజల అనాసక్తి
- 10వ తేదీతో ముగియనున్న ఓటింగ్
- వచ్చే నెలలో ర్యాంకులు

చిత్తూరు అర్బన్: మన మున్సిపాలిటీల్లో పరిశుభ్రత పరిమళాలు విరబూసి, వచ్చే నెలలో ఇచ్చే స్వచ్ఛ పురస్కారం దక్కించుకోవడానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్–2025 సర్వే ప్రారంభమైంది. కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పట్టణాలు, నగరాల్లో స్వచ్ఛత, పారిశుద్ధ్య నిర్వహణ, ఘన–వ్యర్థాల నిర్వాహణ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని దేశ వ్యాప్తంగా ర్యాంకులను ప్రకటిస్తారు. జిల్లాలోని ఓ కార్పొరేషన్‌తోపాటు నాలుగు మున్సిపాలిటీలు ఈసారి స్వచ్ఛ త పోటీల్లో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సమాయత్తమవుతున్నాయి. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి మున్సిపాలిటీలు స్వచ్ఛసర్వేక్షణ్ పోటీల్లో సత్తా చాటడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పట్టణాలు, నగరాల్లో బహిరంగ మల–మూత్రవిసర్జనను నిర్మూలించడానికి ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణం తప్పనిసరి. మున్సిపాలిటీల్లో సేకరించే చెత్తను తడి, పొడిగా వేరుచేసి.. వీటిని ప్రాసెస్ చేయడం ద్వారా ఎరువు తయారీ, అవసరమైతే విద్యుత్ తయారీ వైపు కూడా అడుగులు వేయాలి. చిత్తూరులో ఏడాది క్రితం తెరపైకి వచ్చిన ఈ ప్రతిపాదన ఇంకా ఆచరణకు నోచుకోలేదు.పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడానికి, పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దడానికి ఇందులో చర్యలు చేపట్టాలి.



పరిశుభ్రత-బాధ్యత అంటూ ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు, కార్మికులు(ఫైల్)

నాలుగు దశల్లో..

కేంద్రం సూచించిన నాలుగు దశల్లో ఈ పోటీలు జరుగుతాయి. ఇందులో బహిరంగ మల–మూత్ర విసర్జన నివారించినట్లు ప్రకటించడం (ఓడీఎఫ్), చెత్తను పూర్తిస్థాయిలో శుభ్రం చేయడం, మున్సిపాలిటీల్లో స్వచ్ఛభారత్ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించడం, చివర్లో అధికారులు డాక్యుమెంటేషన్ చేయడం ఉంటుంది. చిత్తూరుతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలో ఓడీఎఫ్–ఫ్రీ జోన్‌గా ఇప్పటికే ప్రకటించాయి. చెత్తను సేకరించే విధానం కూడా పూర్తి అయ్యింది. ప్రస్తుతం జిల్లాలో ఉన్న స్వచ్ఛ భారత్ మిషన్ బృందాలు పలు పట్టణాల్లో క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డుల నిర్వహణను పరిశీలిస్తున్నాయి. ఈ నాలుగు దశలకు 12,500 మార్కులు కేటాయించారు. ఇందులో అత్యధిక మార్కులు వచ్చిన మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో ర్యాంకులు ప్రకటిస్తారు.

చైతన్యం ఏదీ..?

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కంటికి కనిపిస్తున్న పారిశుద్ధ్య నిర్వహణతోపాటు ప్రజల అభిప్రాయాలు ఓటింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెప్పడం కూడా ప్రధానమే. ఇందుకోసం www.rbmurban.orffeedback అనే వెబ్ సైట్‌కు వెళ్లి, మొబైల్ నంబర్ తెలియజేస్తూ భాష, మున్సిపాలిటీ పేరు నమోదు చేసి.. ఇందులో అడిగే పది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ఎంత ఎక్కువ మంది ఈ ఓటింగ్‌లో పాల్గొంటారో.. దాని ఆధారంగా మార్కులు పెరగడం, ర్యాంకు మెరుగుపడడం జరుగుతుంది. కానీ జిల్లాలోని మున్సిపాలిటీలు ప్రజలకు ఈ విషయంపై చైతన్యం కల్పించడంలో విఫలమయ్యాయనే చెప్పవచ్చు. రూ.లక్షల కొద్దీ నిధులు వెచ్చించి ఫ్లెక్సీలు, బోర్డులు పెట్టడంలో చూపించే శ్రద్ధ.. ప్రజల్లో చైతన్యం తీసుకురావ డంలో అధికారులు పెద్దగా దృష్టి పెట్టడంలేదు. ఫలితంగా జిల్లాలో ఇప్పటివరకు కేవలం 31,940 మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈనెల 10వ తేదీతో అభిప్రాయాలు పంచుకోవడానికి గడువు ముగుస్తుంది. అంతలోపు కమిషనర్లు ప్రజలను ఏ మేరకు చైతన్యవంతులను చేస్తారో చూడాలి. ఇక వచ్చే నెలలో జాతీయ స్థాయి ర్యాంకులు ప్రకటించనున్నారు.

గత ఏడాది స్వచ్ఛభారత్ - జాతీయ ర్యాంకులు

మున్సిపాలిటీ	జాతీయ ర్యాంకు
చిత్తూరు	143
పలమనేరు	1,025
పుంగనూరు	1,039
కుప్పం	2,835
నగరి	1,769

ఓటింగ్ ఇలా

మున్సిపాలిటీ	ఓటింగ్‌లో పాల్గొన్నవాళ్లు
చిత్తూరు	28,579
పలమనేరు	115
పుంగనూరు	2,675
కుప్పం	425
నగరి	110

నిలబడతాం



స్వచ్ఛభారత్‌లో ఆశించిన రాష్ట్రస్థాయి ర్యాంకులు వస్తున్నాయి. ఈ సారి జాతీయ స్థాయిలో కూడా రాణించడానికి గట్టిగానే పోటీ ఇస్తున్నాం. ప్రజలు కూడా భాగస్వాములైతేనే నిలబడడం సాధ్యమవుతుంది. మొబైల్ వినియోగిస్తున్న ప్రతి ఒక్కరూ దయచేసి ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి. మన మున్సిపాలిటీ గురించి మాట్లాడండి.
– నరసింహ ప్రసాద్, కమిషనర్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్

గర్వించదగ్గ గొప్ప నాయకుడు జగ్జీవన్‌రామ్

- జగ్జీవన్ రామ్‌కు నివాళి
- ర్యాలీ, అధికారిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : భారతదేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కొనియాడారు. జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదట గంగినేని చెరువు వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి మెసానికల్ మైదానం వద్ద ఉన్న అంబేడ్కర్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ పోరాట యోధుడు అణగారిన వర్గాల ఆశాదీపంగా పేరు తెచ్చుకున్నారన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఆయన కీలకపాత్ర పోషించారని చెప్పారు. దళితుల సామాజిక హక్కుల కోసం పోరాడిన ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, డీఆర్వో మోహన్‌కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి చెన్నయ్య, ఆర్డీఓ శ్రీనివాసులు, నగరపాలక కమిషనర్ నరసింహులు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, డీవీఎంసీ సభ్యులు రాజ్‌కుమార్, ధనశేఖర్, శంకర్, రవి, ధనలక్ష్మి, విజయభాస్కర్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

తప్పిదం వాస్తవం.. క్షమించండి!

- బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో దళితుల ఆగ్రహం
- వేడుకలకు ఆహ్వానపత్రిక అందజేయకుండా చిన్నచూపు చూశారని నిరసన
- జిల్లా అధికారుల తరఫున జిల్లా కలెక్టర్ క్షమాపణలు

చిత్తూరు కలెక్టరేట్ : కిందిస్థాయి ఉద్యోగులు తప్పిదం వాస్తవమే.. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా చూస్తాం .. క్షమించండి అని.. కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ చేతులెత్తి దండంపెట్టి కోరారు. సీఎం సొంత జిల్లా కేంద్రమైన చిత్తూరులో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో దళితులకు అవమానం జరిగింది. ఈ వేడుకలకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు దళిత సంఘ నాయకులకు ఆహ్వానం ఇవ్వకుండా అవమానించారు. దీంతో పలువురు దళిత సంఘాల నాయకులు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఎదుటే శనివారం నిరసనకు దిగారు. కూటమి పాలనలో దళితులు నిర్లక్ష్యానికి గురవుతున్నామని కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కిందిస్థాయి ఉద్యోగులు చేసిన తప్పిదం వాస్తవమేనని, తప్పకుండా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ దళిత సంఘం నాయకులకు చేతులెత్తి దండం పెట్టి, క్షమాపణలు కోరారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో దళిత సంఘ నాయకులు శాంతించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రాజ్‌కుమార్, ధనలక్ష్మి, ధనశేఖర్, శంకర్, రవి, విజయభాస్కర్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.



దళిత నేతలకు క్షమాపణలు కోరుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

అసలు నైజం బట్టబయలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు

- మైనారిటీలకు ఇది మరో బ్లాక్‌డే
- నమ్మకద్రోహం చేశారు
- వైఎస్సార్‌సీపీ ముస్లిం నేతల ఆగ్రహం

పలమనేరు: వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లు ఆమోదంతో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలకు మైనారిటీలపై ఉన్న అసలు నైజం బట్టబయలైందని వైఎస్సార్‌సీపీ మైనారిటీ నేతలు మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణ కన్వీనర్ హేమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముజ్జు, అబ్దుల్లా, హైదర్, నయాజ్ మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ముస్లింల ఓట్ల కోసం నాటకాలాడి, వారి స్వార్థం కోసం తమను కరివేపాకులా వాడుకుని తీసి పడేస్తాయన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం పాటించకుండా కేంద్రం వక్ఫ్ బిల్లును ఆమోదింపజేసిందన్నారు. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ మాత్రం దీన్ని వ్యతిరేకించడం అభినందనీయమన్నారు. ఈ బిలుతో మసీదులపై తమ మతపెద్దల పెత్తనం ఉండదన్నారు. ముఖ్యంగా వేలాది ఎకరాల భూములపై పెద్దల కన్ను పడి కార్పొరేట్ శక్తుల చేతికి ఈ భూములు వెళ్లడం ఖాయమన్నారు. బిల్లు పాసైన దినం మైనారిటీలకు మరో బ్లాక్‌డే అని అన్నారు. ముస్లింలకు అండగా ఉంటామని గత ఎన్నికల్లో మాటిచ్చిన చంద్రబాబు ఇప్పుడు బీజేపీతో దోస్తీ కోసం బిల్లుకు అనుకూలంగా ఓటేసి ముస్లింలకు వెన్నుపోటు పొడిచారన్నారు. దీన్ని గమనించిన రాష్ట్రంలోని మైనారిటీలు ఆ పార్టీని వీడాలని పిలుపునిచ్చారు. చట్ట సవరణతో అన్యమతస్తుల ప్రమేయం జరిగి వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలమ్మ సైతం ఎందుకు దీనిపై గట్టిగా బీజేపీ, కూటనిని ప్రశ్నించడం లేదన్నారు. ఇప్పుడు వక్ఫ్ భూముల చట్టాలను మార్చినట్టే రేపు క్రిష్టయన్ ఆస్తులు, ఆపై ఎండోమెంట్ ఆస్తులను ఆక్రమించే బిల్లులను కూటమి ప్రభుత్వం చేయడం తథ్యమన్నారు. రహీంఖాన్, కమాల్, షరీఫ్,హయాత్,నఈం, అల్తాఫ్, అక్బర్, అబ్దుల్లా, ఖాదర్, ఫిరోజ్,బాబు, జమీలా, నౌజియా పాల్గొన్నారు.

కాలకూటమి.. చక్రబంధనం

అబద్ధాల విషవలయం చుట్టుముడితే.. ఆకాశానికి నిచ్చెన వేసి ఆశల పల్లకిలో ఊరేగిస్తే.. అరచేతిలో వైకుంతం చూపితే నిజమని నమ్మిన వాహనచోదకుడు కాలకూటమి చక్రబంధనంలో చిక్కుకున్నాడు. అది మాయ చక్రమని తెలుసుకునేలోపు నివురుగప్పిన మోసం నిలువునా ముంచేసింది. బతుకు బండి ఆగేలా చేసింది. బంగారు భవితను అంధకారం చేసింది. ఫలితంగా డ్రైవర్ల జీవన చక్రం ఆగిపోయింది.

బతుకు బండికి భరోసా కరువు

- వాహనమిత్ర లేదు.. చలానాల మోత తప్పలేదు
- ఆటో, మ్యాక్సీక్యాబ్‌ల డ్రైవర్ల ఆవేదన
- గతంలో ఏటా రూ.10 వేలు ఆర్థిక సహాయం
- పథకం అటకెక్కించిన కూటమి



పాలసముద్రం బస్టాండ్‌లో ఆగి ఉన్న ఆటోలు

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అటకెక్కించింది. ఎన్నికల హామీలు అమలు చేయకుండా సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోంది. అందులో భాగంగానే సొంత ఆటో, మ్యాక్సీక్యాబ్‌లు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు నిరాశ మిగిలింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వాహనమిత్ర పథకం కింద డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు క్రమం తప్పకుండా ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తం వాహనాల బీమా, ఫిట్‌నెస్, చిన్న చిన్న మరమ్మతులకు ఉపయోగించుకుని వారు లబ్ధి పొందారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ పథకం అమలు చేయకపోవడంతో డ్రైవర్లపై ఆర్థిక భారం పడుతోంది. మరో వైపు తనిఖీల పేరుతో అధిక మొత్తంలో రుసుములు వసూలు చేస్తుండడంతో వాహనం రోడ్డుపైకి తేవాలంటేనే వారు హడలిపోతున్నారు.

వాహనం నడవని దుస్థితి

జిల్లాలో ఆటో, మ్యాక్సీక్యాబ్ వాహనాలు నడుపుతూ 4,725 మంది తమ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం చిన్నచూపుతో వాహనాలను నడపలేని దుస్థితి నెలకొందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కనీస అపరాధ రుసుం రూ.130 ఉంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ మొత్తాన్ని రూ.1,050 పెంచింది. దీంతో సంపాదన మొత్తం అపరాధ రుసుం చెల్లించడానికి కూడా వారికి సరిపోవడం లేదు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించకపోయినా బాధలేదని, తనిఖీల పేరుతో తమపై జరిమానాల భారం విధించకుండా ఉంటే చాలని ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



గతంలో ఐదు విడతల్లో వాహన మిత్ర పథకం ద్వారా రూ. 50 వేలు లబ్ధి పొందాను. ఆ మొత్తం ఆటో మరమ్మతులు, ఫిట్‌నెస్‌కు సరిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎటువంటి ఆర్థిక సాయం అందించడం లేదు. తిరిగి ప్రభుత్వానికి ఆటో, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లపై భారీగా చలానా విధిస్తున్నారు. ఎలా బతకాలి.
–షేక్ నిషార్, ఆటో డ్రైవర్, కార్వేటినగరం మండలం

తప్పని ఆర్థిక భారం



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు వచ్చేది. ఆ మొత్తం మాకు అవసరాలకు ఉపయోగపడేది. మాకు ఆర్థికంగా ఊరట కలిగింది. కూటమి సర్కారులో భరోసా లేదు. సంపాదన అంతంత మాత్రం కావడడంతో జీవనం కష్టంగా ఉంది. –జయశీలన్, ఆటో డ్రైవర్, నగరి

భయం వేస్తోంది!



నేను పదేళ్లుగా ఆటో నడుపుతూ బతుకుతున్నాను. గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు భారీ మొత్తంలో చలానా విధిస్తున్నారు. గత ప్రభుత్వంలో కేవలం రూ.130 చలానా వేసేవారు. ఇప్పుడది రూ.వేలల్లోకి చేరింది. సంపాదన చలానాలకే సరి పోతోంది. – కిరణ్‌కుమార్, ఆటోడ్రైవర్, ఎట్టేరి, జీడీనెల్లూరు మండలం

క్లుప్తంగా

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. చిత్తూరు నగరం తోటపాళేనికి చెందిన 38 మహిళ గత నెల 29వ తేదీన అదృశ్యమైంది. కుటుంబసభ్యులు. బంధువుల పలుచోట్ల గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో బాబు అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

భూ వివాదం.. దాడి

శాంతిపురం: రాళ్లబూదుగూరు పంచాయతీలోని గొల్లపల్లిలో భూ వివాదం కారణంగా జరిగిన దాడిలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. బాధితుల కథనం మేరకు.. గొల్లపల్లికి చెందిన జీకే సుబ్రమణ్యానికి తన తాత, తండ్రుల నుంచి రాళ్లబూదుగూరు రెవెన్యూలో 2.08 ఎకరాల అసైన్డ్ భూమి సంక్రమించింది. 50 ఏళ్లుగా వీరి కుటుంబ ఆధీనంలోని ఈ భూమి తమదని రామేగానిపల్లికి చెందిన వ్యక్తి రెండు నెలలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాధితుడు గత నెల 20వ తేదీన రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో శనివారం ప్రత్యర్థులు దాడి చేయడంతో గాయపడిన సురేష్ కుప్పం ప్రాంతీయ వైద్యశాలలో చేరాడు. దీనిపై కుప్పం డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

తప్పిపోయిన పిల్లల అప్పగింత

చిత్తూరు అర్బన్: తల్లిదండ్రుల మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు పిల్లలను చిత్తూరు టూటౌన్‌పోలీసులు శనివారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఓ ప్రైవేటు స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న పవిత్ర, గౌతమ్ కృష్ణ ఇంట్లో మందలించారని రూ. వెయ్యి తీసుకుని చెన్నైకు వెళ్లిపోయారు. తల్లిదండ్రులు పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. వారు మొబైల్ ఆధారంగా గుర్తించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, పిల్లలను వారికి అప్పగించారు.

28 నుంచి సమ్మర్ హాబీ క్యాంప్

తిరుపతి కల్చరల్: ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28 నుంచి మే 31వ తేదీ వరకు 'సమ్మర్ హాబీ క్యాంప్' ఉంటుందని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస నెహ్రూ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం వరకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. సైన్స్ సఫారీ, పోల్డ్ కనెక్ట్ లైట్, త్రీడీ డిజైన్ ప్రింటింగ్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయోసైన్స్, జూనియర్ డ్రోన్ మాస్టర్, ఆస్ట్రోనమీ వంటి సబ్జెక్టులలో 4 నుంచి 6వ తరగతి విద్యార్థులు, టెన్త్ విద్యార్థులకు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 0877–2286202, 7989694681 లలో సంప్రదించాలని సూచించారు.

456 మొబైల్ ఫోన్ల అప్పగింత

చిత్తూరు అర్బన్: సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడం, కొన్నిసార్లు ఫోన్లు చోరీకి గురవడం లాంటి ఘటనలను ఛేదించిన చిత్తూరు పోలీసులు దాదాపు రూ.91.20 లక్షల విలువ చేసే 456 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించారు. శనివారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మణికంఠ ఈ వివరాలను వెల్లడించారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు, చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు వాటి వివరాలను పోలీసుశాఖకు వాట్సప్‌లో ఫోన్–9440900004 నంబర్‌కు హాయ్ అని పెట్టడం, సీఈఐఆర్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవడంతో వారి ఫోన్లను కనిపెట్టి.. అప్పగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేసి బాధితుల వద్ద ఉన్న వివరాల ఆధారంగా ఫోన్లను దేశంలోని ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి తెప్పించామన్నారు. ఇందుకోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఐటీ విభాగం పనిచేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 11 దఫాల్లో 3,541 సెల్ ఫోన్లను బాధితులకు అప్పగించామన్నారు. వీటి విలువ రూ.7.42 కోట్లు ఉంటుందన్నారు. సెల్ ఫోన్లను రికవరీ చేసిన సీసీఎస్ సీఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది బాపూజీ, రఘురామ్, శ్రీనివాస్ ఇతర సిబ్బందికి సర్టిఫికెట్లను అందజేసిన ఎస్పీ, వారిని అభినందించారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లతో ఎస్పీ, బాధితులకు ఇచ్చిన ఫోన్లు

విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్టేట్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో విజయం డిగ్రీ కళాశాల 22వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ నేటి ప్రపంచీకరణ యుగంలో ప్రతి విద్యార్థి విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. క్రమశిక్షణ, ధృడనిశ్చయంతో విద్యార్థులు ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. మరో అతిథి ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ మాట్లాడుతూ ప్రతి అవమానాన్ని అవకాశంగా మలచుకుని ఉన్నత స్థాయికి ఎదిగి, సన్మానం చేసే స్థాయికి మారాలన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు తన పాటల రూపంలోనే సమాధానాలిస్తూ విద్యార్థులను ఉత్తేజపరిచారు. చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఎదగాలంటే సానుకూల దృక్పథం, అంకితభావం ముఖ్యమన్నారు. అనంతరం ఆ కళాశాల అకడమిక్ డైరెక్టర్ శైలజా వార్షిక నివేదికను సమర్పించారు. తరువాత విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, అనంతపురం శ్రీ వివేకానంద ఎడ్యుకేషనల్ విద్యాసంస్థల చైర్మన్ రవీంద్ర చౌదరి పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

- వృద్ధురాలికి సీపీఆర్
- తప్పిన ప్రాణాపాయం

వెదురుకుప్పం: ఎస్ఐ, పీఎంపీ సమయస్ఫూర్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని కాపాడింది. స్థానికుల కథనం మేరకు.. కార్వేటినగరం మండలం గాదంకి గ్రామానికి చెందిన వృద్ధురాలు రాజమ్మ, మనవడితో కలిసి శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంలో వెదురుకుప్పం వెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి ఇంటికి పయనమయ్యారు. మార్గం మధ్యలో అయ్యన్నగారిపల్లె వద్ద హైబీపీ రావడంతో కళ్లు తిరిగి కిందపడిపోయింది. ఆ సమయంలో అదే మార్గంలో వస్తున్న వెదురుకుప్పం గ్రామానికి చెందిన ప్రైవేటు వైద్యుడు మధు గమనించి వెంటనే ఆగి, స్పృహ తప్పి పడిపోయిన వృద్ధురాలికి సీపీఆర్ చేశాడు. దీంతో వృద్ధురాలు కోలుకుంది. ఇదే క్రమంలో పచ్చికాపల్లం వైపు నుంచి వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌కు వెళుతున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య సంఘటనా స్థలంలో వాహనాన్ని ఆపి, పరిస్థితిని చూసి వృద్ధురాలిని తన వాహనంలో మెరుగైన వైద్యం కోసం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ప్రైవేటు వైద్యుడు మధు చూపిన మానవత్వం, సమయస్ఫూర్తికి అందరూ అభినందనలు తెలిపారు.

సేవ చేయాలన్న ఆశయంతోనే..

- గ్రూప్–2కు ఎంపికైన కానిస్టేబుల్ ఆదినారాయణ
- గ్రూప్స్‌లో సత్తాచాటిన చౌడేపల్లె కానిస్టేబుల్


ఆదినారాయణ

చౌడేపల్లె: పేదలకు సేవా చేయాలన్న ఆశయంతోనే గ్రూప్–2 పరీక్షల్లో విజయం సాధించానని ర్యాంకర్ ఆదినారాయణ పేర్కొన్నారు. కానిస్టేబుల్ అయిన ఈయన ఒత్తిళ్లను అధిగమిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూనే గ్రూప్–2 పరీక్షల్లో సత్తా చాటి, నేటి తరం యువతకు ఆదర్శంగా నిలచాడు. చౌడేపల్లెలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వి.ఆదినారాయణ పెద్దపంజాణి మండలం బందార్లపల్లెలో ఓ నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన కృష్ణప్ప, వెంకటమ్మకు మూడో సంతానం. వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులు ఈయన్ని చదివించారు. ఆ సమయంలోనే ఆదినారాయణ తల్లితండ్రులకు చేదోడువాదోడుగా పనులు చేస్తూ ఆర్థికంగా చేయూతనిస్తూ అటు చదువులోనూ రాణిస్తూ ఉండేవాడు. బందార్లపల్లెలో ఐదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివారు. అనంతరం నిడిగుంటలో పదోతరగతి వరకు, ఇంటర్, డిగ్రీ పలమనేరు ప్రభుత్వ కళాశాలలో చదివారు. చదువు పూర్తి కాగానే 2004లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. నిజామాబాద్, కడప బెటాలియన్‌లో పనిచేశారు. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తూ 2009లో సివిల్ కానిస్టేబుల్‌గా రీసెలెక్ట్ అయి, మళ్లీ శిక్షణ పొంది కానిస్టేబుల్‌గా చేరారు. సదుం, మదనపల్లె, ట్రాన్స్‌కో విజిలెన్స్, విభాగంలో పనిచేస్తూ బదిలీపై చౌడేపల్లె పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. విధులు నిర్వహించిన ప్రతి చోటా ఉత్తమ సేవా పతకాలు పొందారు. ఆ ప్రయాణం అంతటితో ఆగకుండా పట్టుదలతో గ్రూప్–2 పరీక్షలకు సిద్ధం అయ్యారు. శనివారం విడుదల చేసిన గ్రూప్–2 పరీక్షా పలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. కానిస్టేబుల్ ఆదినారాయణను ఎస్సీ మణికంఠ చందోలు, సీఐ రాంభూపాల్, ఎస్ఐ నాగేశ్వరరావు, సహచర సిబ్బంది అభినందించారు.

బెట్టింగ్ కేసులో నిందితుడి అరెస్టు

పెద్దపంజాణి: బెట్టింగ్ కేసులో రాయలపేటకు చెందిన కె.లక్ష్మీనారాయణ అలియాస్ అశోక్‌ను శనివారం అరెస్టు చేసినట్లు పలమనేరు రూరల్ సీఐ మురళీమోహన్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని రాయలపేటకు చెందిన బెట్టింగ్ యాప్ నిర్వాహకుడు చంద్రబాబు, అతని తమ్ముడు లక్ష్మీనారాయణ అలియాస్ అశోక్, తండ్రి నాగరాజు, భార్య రేవతి, అమ్మ సరసమ్మ, బాలాజీ, సుభేష్, రాజేష్‌తోపాటు స్నేహితుల అకౌంట్ నంబర్ తీసుకుని ఆ అకౌంట్ నంబర్ల ద్వారా ప్రజలను మభ్యపెట్టి బెట్టింగ్ భూతంలోకి లాగుతూ వచ్చాడు. దీంతో చాలా మంది యువకులు తెలిసీ తెలియక వారి వేర్వేరు అకౌంట్లలో డబ్బులు వేసి, పందెం కాసి ఆస్తులన్నీ కోల్పోతున్నారు. ఈ క్రమంలో నిందితుడు లక్ష్మీనారాయణను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

నల్లబెల్లం సరఫరా దారుడు..

చిత్తూరు అర్బన్: సారా తయారీకి నల్లబెల్లం సరఫరా చేస్తున్న వ్యక్తిని శనివారం చిత్తూరు అర్బన్ ప్రొహిబిషన్ అధికారులు అరెస్టు చేశారు. అందిన సమాచారం మేరకు.. ఎక్సైజ్ శాఖ అధికారులు గుడిపాల మండలం చిత్తపార గ్రామంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి నల్లబెల్లం విక్రయిస్తున్న చంద్రన్(34) అనే వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్ చేసినట్లు సీఐ శ్రీహరి పేర్కొన్నారు.

పాఠశాలల్లో టీవీలే టార్గెట్

- వరుస చోరీలతో స్వైరవిహారం
- ఐదుగురు నిందితుల అరెస్టు, ఒకరు పరారీ
- ఏడు టీవీలు, మూడు ద్విచక్రవాహనాల స్వాధీనం

యాదమరి: వారి టార్గెట్.. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోని టీవీలే. పగలంతా పూటుగా మద్యం సేవించి చోరీలకు ప్రణాళికలు రచించడం, రాత్రయితే ఎంచుకున్న పాఠశాలల్లోకి చొరబడి చోరీ చేయడం, వచ్చిన సొమ్ముతో ఎంజాయ్ చేయడంమే వారి దినచర్య. ఎవరూ తమని కనిపెట్టరనే ధీమానో..లేక తమ తెలివితేటలు ముందు పోలీసులెంత అనుకున్నారేమో కానీ వరుస చోరీలతో స్వైరవిహారం చేశారు. అటు ఉపాధ్యాయులకు, ఇటు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. మూడు నెలల పాటు జరిగిన వారి చోరీలకు పోలీసు చెక్ పెట్టారు. మండలంలోని వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలతోపాటు మండలానికి చెందిన నలుగురు దుండగులను శనివారం స్థానిక ఎస్ఐ ఈశ్వర్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో చిత్తూరు రూరల్ పశ్చిమ విభాగ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని టీవీలు వరుసగా చోరీలకు గురవుతున్నట్టు ఫిర్యాదులు అందాయన్నారు. అందులో భాగంగా కొందరి అనుమానితులను విచారించగా మండలంలోని కొట్టాలం ఉన్నత పాఠశాలలో 1, యాదమరి ఉన్నత పాఠశాలలో 2, పచ్చాపూరు ఎంపీపీ పాఠశాలలో 1 టీవీలు, అలాగే చిత్తూరు తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని తుమ్మింద ఎంపీపీ పాఠశాలలో మూడు టీవీలు చోరీ చేసినట్లు అంగీకరించడంతో ఒక బాలనేరస్తునితో పాటు మొత్తం ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. అరెస్టు అయిన వారిలో మండలంలోని తెల్లారాళ్లపల్లి పంచాయతీకి చెందిన చక్రపాణి చామంతి, సంపంగి నెల్లూరు వాసి కార్తీక్, తెల్లరాళ్లపల్లె నివాసి దేవేంద్రన్, తమిళనాడు పరదరామి సమీపంలోని బాలగౌండర్ పట్టికి చెందిన మురళీ రఘునాథన్, తన్నీర్ పందిల్‌లోని ఓ బాలుడిపై ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన టీవీలు, రూ.3 లక్షల విలువైన మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల్లో సంపంగి నెల్లూరుకు చెందిన దామోదరన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసు ఛేదించిన ఎస్ఐ ఈశ్వర్, సిబ్బందిని సీఐ అభినందించారు. కార్యక్రమంలో రైటర్ కృష్ణమూర్తి ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ దుర్మరణం


మృతుడు రఘుకుమార్

పుత్తూరు: విధులు ముగించుకుని గ్రామానికి చేరుకుంటున్న ఏఎస్ఐ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన సంఘటన శనివారం రాత్రి పుత్తూరు మండలం వేపగుంట క్రాస్ వద్ద చోటు చేసుకుంది. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు.. పుత్తూరు మండలం వేపగుంట పంచాయతీ అక్కేరి దళితవాడకు చెందిన ఎ.రఘుకుమార్(59) తిరుపతి ఎంఆర్‌పల్లెలో ఆర్మ్డు రిజర్వు పోలీస్ ఫోర్స్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. శనివారం యథావిధిగా విధులను ముగించుకుని తిరుపతి నుంచి బస్సులో స్వగ్రామానికి బయలుదేరి వేపగుంట గ్రామం వద్ద దిగి రోడ్డు క్రాస్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి 108లో పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసంబద్ధతలు తొలగించాలి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉపాధ్యాయుల బదిలీల చట్టంలో అసంబద్ధతలను తొలగించాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బదిలీల చట్టంలో అనేక అసంబద్ధతలున్నట్లు చెప్పారు. వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల నుంచి ఎటువంటి సలహాలు, సూచనలు తీసుకో కుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం భావ్యం కాదని మండిపడ్డారు. సర్వీస్ పాయింట్‌ల విషయంలో ఏ ఉపాధ్యాయుడు నష్టపోకుండా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. స్పెషల్ కేటగిరీ, ప్రిఫరెన్షియల్ కేటగిరీలకు సంఘాలు, టీచర్ల నుంచి వచ్చిన వినతుల ఆధారంగా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల హామీలు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. వెంటనే 12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు పురుషోత్తం, దేవరాజు రెడ్డి, బిక్క మురళి, చంద్రన్, సుబ్ర హ్మణ్యం పిళ్లైతదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోమువీర్రాజు

చిత్తూరు కార్పొరేషన్: పాస్టర్ ప్రవీణ్ మృతిని వివాదాస్పదం చేయవద్దని, ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు తెలిపారు. ఎమ్మెల్సీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి శనివారం చిత్తూరుకు వచ్చారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మీడియాతో మాట్లాడారు. లోక్‌సభలో వక్ఫ్ బిల్లు ఆమోదం ద్వారా ముస్లిం మహిళలతో పాటు మైనారిటీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతి విషయంలో ప్రభుత్వం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోందని, ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇస్తున్న నిధుల్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్‌లు పూర్తి స్థాయిలో వినియోగించుకుంటారన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి, టమాట సాగు ఎక్కువ ఉన్న నేపథ్యంలో గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో మార్కెట్ కమిటీల నిర్ధారించిన ధరలకే పంటలు విక్రయిస్తున్న నేపథ్యంలో అక్కడి రైతులు గిట్టుబాటు ధరతో ప్రయోజనం పొందుతున్నారని, అదే విధానాన్ని చిత్తూరు జిల్లా మార్కెట్ కమిటీలు అమలు చేసి, రైతులకు ప్రయోజనం కల్పించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా ఆనంద్, రాష్ట్ర నాయకులు నిషితరాజు, నాయకులు బ్రహ్మానందం, రామభద్ర, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.